క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో విశ్వనాథన్, హెచ్ఎం కాంతం

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను సోమవారం ఎంఈవో విశ్వనాథన్, పాఠశాల హెచ్ఎం కాంతం అభినందించారు.10వ తరగతి విద్యార్థిని బి.హేమలత అండర్–17 విభాగంలో, 8వ తరగతి విద్యార్థిని ఆర్.ఢిల్లేశ్వరి అండర్ – 14 విభాగంలో ప్రతిభ చూపారని పీడీ ఇస్మాయిల్ తెలిపారు.

నడుపూరు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పెదగంట్యాడ: స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్–2047 డిబేట్ పోటీల్లో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుహాని గీతిక, వర్షిణి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వక్తృత్వ పోటీలో సుహాని గీతిక ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో చంద్రకళ విద్యార్థులను తీర్చిదిద్దిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నరసింహను అభినందించారు. పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులకు చికిత్స



విద్యార్థులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులకు సరైన చికిత్స అందిస్తున్నామని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు దేవాడ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న చిన్న అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, శ్రీనివాసరావు, బి.గోపాలం, ఎం.దేవి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఎంపికల షెడ్యూల్‌లో మార్పులు

అగనంపూడి: సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్–2 (ఎఫ్‌ఏ–2) పరీక్షల వాయిదా కారణంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా ఎంపికలను రీ షెడ్యూల్ చేసినట్టు ఎస్‌జీఎఫ్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించాల్సిన ఎఫ్‌ఏ–2 పరీక్షలను వచ్చేనెల 4 నుంచి 6వ తేదీలకు రీషెడ్యూల్ చేసిన నేపథ్యంలో క్రీడా ఎంపికలు కూడా రీ షెడ్యూల్ చేసినట్టు పేర్కొన్నారు. 23న హాకీ ఎంపికలు అండర్–14 బాలురు, బాలికలకు నక్కపల్లి హైస్కూల్‌లో, 24న బేస్‌బాల్, రోప్ స్కిప్పింగ్ ఎంపికలు అండర్ 14, 17 విభాగంలో అనకాపల్లిలోని జీఎంపీఎస్ పాఠశాలలో, టెన్నికాయిట్ ఎంపికలు అండర్ 14, 17 విభాగంలో అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్‌లో, 25న వాలీబాల్ ఎంపికలు అండర్–14 విభాగంలో ఎ.ఎల్.పురంలో, 26న యోగాసన ఎంపికలు వేంపాడు జెడ్పీ హైస్కూల్‌లో, 29న త్రోబాల్ పోటీలు హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ధరల మంట

ధరలు బాగా పెరిగిపోయాయి



నేను భవన నిర్మాణ కార్మికుడిని. కూలికి వెళితేనే డొక్కాడే పరిస్థితి. సరుకులతో పాటు కూరగాయాలు, వంట నూనె ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గతంలో కేజీకి తక్కువలేకుండా కొనే మేము ఇప్పుడు పావు కేజీ, అరకేజీ కూరగాయాలే కొనుగోలు చేయాల్సి వస్తోంది.పెరిగిన ధరల బాధ ఒక పక్క.. ఇసుక అందుబాటులేక సరిగ్గా పనులు లేక అప్పులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం..

– బి రాజేష్, భవన నిర్మాణ కార్మికుడు, దయాల్‌నగర్



- నిప్పుల్లా నిత్యావసరాలు
- హడలెత్తిస్తున్న కూరగాయల ధరలు
- వండకుండానే ఉడుకుతున్న పప్పులు
- సలసల కాగుతున్న వంటనూనెలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

నిత్యావసరాలు ధరలు మండిపోతున్నాయి.. సరుకులు కొందామని మార్కెట్‌కు వెళ్లే సామాన్యుల గుండె దడపుడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయాలు, వంట నూనెల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఒక్కసారిగా రేట్లు పెరిగిపోవడంతో వినియోగదారులు ఏం కొంటాం.. ఏం తింటాం అంటూ నిట్టూరుస్తున్నారు.. **మినప పప్పు ధర మండిపోతోంది.. కంది పప్పు ధర కస్సుమంటోంది.. శనగ పప్పు రేటు శరాఘాత**ంలా కనిపిస్తోంది. పెసర పప్పు.. వేరుశనగ ఇలా ఒకటేమిటీ అన్ని ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు మండిపోతున్నాయి. –పెదగంట్యాడ


పప్పుల ధరలు కేజీ ఇలా..

పప్పు పేరు	గతంలో..	ప్రస్తుతం
కంది పప్పు	రూ.130	రూ.200
మినప పప్పు	రూ.120	రూ.150
శనగ పప్పు	రూ.100	రూ.130
పెసరపప్పు	రూ.110	రూ.140
వేరు శనగ	రూ.120	రూ.150
కొమ్ము శనగలు	రూ.75	రూ.100
కాబోలి శనగలు	రూ.190	రూ.220



కూర కుదరడం లేదు

ఉల్లిని కోయకుండానే కన్నీరు వస్తోంది. టమాటా ధర చూస్తే గూబ గుయ్ మనిపిస్తుంది. గతంలో కిలో టమాటా ధర చూస్తే రూ.30 ఉండేవి. ప్రస్తుతం రూ.80. ఉల్లిపాయలు రూ. 30 ఉంటే నేడు రూ.70కి చేరింది. మిగతా ఏ కూరగాయలు **చూసినా కిలో** రూ. 60 నుంచిరూ.100 వరకూ అమ్ముతున్నారు. ఇప్పుడే **ఇలా ఉంటే కార్తీ**కమాసంలో మరింత ధరల మోత మోగుతుందని ప్రజలు **బెంబేలెత్తిపోతు**న్నారు. రానున్న **రోజుల్లో మరింత** ధరలు **పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.**



ఏమీ కొనలేం.. ఏమి తినలేం



పెరిగిన ధరల కారణంగా మాలాంటి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే పేద, మధ్య తరగతి ప్రజలు ఏమి కొనలేక తినలేని పరిస్థితిలో ఉన్నాం.నిత్యావసర సరుకులు లేనిదే ఇల్లు గడవదు. పెరుగుతున్న ధరలు చూసి ఎలా బతకాలో భయమేస్తోంది.ప్రభుత్వం పేదవారిని దృష్టిలో ఉంచుకుని ధరలు నియంత్రణ చేయాలి.

–కె నూకాలమ్మ, పెదగంట్యాడ

దళారుల ఇష్టారాజ్యం



అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో దళారులు చక్రం తిప్పుతున్నారు. వచ్చిన సరకును నేరుగా మార్కెట్లకు తరలించకుండా స్టోరేజీల్లో స్టోర్ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఆపై ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారు.అధికారులు చొరవ చూపాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి దళారులకు చెక్ పెడితే కొంత ఉపశమనం కలుగుతుంది.

– గొందేశి సుమన్‌రెడ్డి, నెల్లిముక్కు.

సామాన్యులు బతికేదెలా?



నాలుగు నెలల నుంచి నిత్యావసర సరకులు ధరలు విపరీతంగా పెరిగాయి..ఇలా పెరిగిపోతుంటే ఏం కొంటాం .. ఏం తింటాం.. పప్పుల ధరలే కాదు కూరగాయలు, ఆకు కూరలు, నూనెలు ధరలు కూడా మండిపోతున్నాయి. మార్కెట్లోకి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇలా అయితే సామాన్యులు బతకడం కష్టమే.

–సి.అన్నపూర్ణ,సిద్ధేశ్వరం

కాగుతున్న వంట నూనెలు



కూరగాయలు,నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దీనికి తోడు వంట నూనెలు కూడా సలసల కాగుతున్నాయి.రిఫైండ్ ఆయిల్ మాట అటుంచితే..పామాయిల్ కూడా కొండెక్కి కూర్చొంది. పామ్‌ఆయిల్ రూ.130, రిఫైండ్ ఆయిల్‌రూ. 140 కి చేరింది.. దీంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు.

నాడు అందుబాటులో పప్పులు



మార్కెట్‌లో పప్పులు ధరలు చూసి వినియోగదారులు నివ్వెరపోతున్నారు. ప్రతి నిత్యం ప్రతి ఇంట్లో విరివిగా వినియోగించే పప్పు దినుసులు ఇలా ధరలతో మోతెక్కిస్తున్నాయి. సామాన్యులకు ధరలు అందుబాటులో లేకపోవడంతో కిలో కొనేవారు అరకిలో, పావు కిలో కొనుగోలు చేస్తూ సర్దుకుపోతున్నారు. గతేడాది కిలో కంది పప్పు రూ.120 నుంచి 130 ధర ఉండేది. మినప పప్పు రూ. 115 నుంచి రూ.120 వరకూ పలికేది. అలాగే వంట నూనెలు పామ్ ఆయిల్ రూ.95 నుంచి రూ.100 మధ్యలో ఉండేది

వంతెనకు బీటలు.. పెరిగిన చెట్లు

ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



రైల్వే క్రాసింగ్ వంతెన శ్లాబుల్లో పెరుగుతున్న రావిచెట్లు, బీటలు వారిన శ్లాబు, గోడ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ క్రాసింగ్ వంతెన రావిచెట్లకు స్థావరంగా మారింది. రాజీవ్‌నగర్ కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్ ఫారం వీఎస్ఈజెడ్‌లను అనుసంధానం చేస్తూ వంతెన నిర్మించారు. అయితే వంతెన శ్లాబ్‌లు, పిల్లర్లలో రావిచెట్లు పెరుగుతున్నాయి. సుమారు పది చోట్ల పిల్లర్లు, శ్లాబుల్లో రావిచెట్ల వేళ్లు గుబురుగా పెరిగిపోవడంతో గోడలు, పిల్లర్లు, శ్లాబ్‌లు బీటలు వారాయి. దీంతో వర్షం పడితే శ్లాబుల నుంచి నీరు ధారాళంగా కారిపోతుంది. గతంలో రెండు చోట్ల గుబురుగా పెరిగిన వృక్షాలను తొలగించారు. అయితే వాటి వేళ్లను తొలగించకపోవడంతో మళ్లీ అదే చోట మొక్కలు పెరిగాయి. ఈ కారణంగా గోడలు, పిల్లర్లు, శ్లాబ్ బలహీనమై ఎక్కడికక్కడ తీకవుతోంది. తక్షణం అధికారులు స్పందించి బీటలు వారిన శ్లాబులు,పిల్లర్లకు మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదం తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

అమృతరావుకు ఘన నివాళి



ఉక్కు ఉద్యమనేత అమృతరావుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమకారుడు దివంగత టి. అమృతరావు 104వ జయంతిని సోమవారం గాంధీ మిషన్ వ్యవస్థాపకుడు టి. మోహన్ గాంధీ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద ఉన్న అమృతరావు విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, లీడర్ సంపాదకులు వి.వి. రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధమైన మహోన్నత వ్యక్తి అమృతరావు అని కొనియాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని అందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, జె. ముత్యాలు రామ్మోహన్‌కుమార్, పట్టా రామఅప్పారావు, పరంధామయ్య, బి. ఎల్లాజి, పాత్రేటి పెంటారావు, మాటూరి శ్రీనివాసరావు, బి. వెంకటరావు, బయ్యే మల్లయ్య, బి. సాయి, కోరాడ వెంకటరావు,బలిరెడ్డి సత్యనారాయణ, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఎ.వి. రమణారావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కేవీలో సందడిగా శ్రేష్ట భారత్ ఉత్సవాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ శ్రీవిజయనగర్ కేంద్రియ విద్యాలయం–2 లో ఏక్‌భారత్, శ్రేష్ట భారత్ ఉత్సవాలు –2024ను సోమవారం ఘనంగా నిర్వహించారు. సీబీఎస్‌సీ పాఠశాల పర్యవేక్షకుడు సి.వి నరసింహం, దూరదర్శన్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ షఫీ మహ్మద్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారి శక్తి సామర్థ్యాలను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మూడు రోజులు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రేతర స్థాయి నుంచి 8 క్లస్టర్లలో 72 పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన పోటీల్లో తమ ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, రామ్‌భూపాల్, లక్ష్మీపాపాయి, రామచంద్రరావు పాల్గొన్నారు.

16, 17న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు

అల్లిపురం : విశాఖ జిల్లా ఏఐఎస్‌ఎఫ్ 32వ మహాసభలు నవంబర్ 16, 17న నగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో పి.శేఖర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహాసభల్లో జిల్లాలో గల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నూతన కార్యవర్గంతోపాటు జిల్లా సమితిని ఎన్నుకుంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా సమితి సభ్యులు శివరాజ్‌కుమార్, శివరామరెడ్డి, సందీప్, కిరణ్, లవకుమార్, సూర్య గణేష్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రం విద్యతో ఉపాధి అవకాశాలు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల అధ్యక్షతన విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కె.హనుమంతరావుచే అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. భౌతికశాస్త్రం–పరిణామాలు అనే అంశంపై ఆయన సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. భౌతికశాస్త్రం అధ్యయనం వల్ల సమాజంలో పెరిగిన సాంకేతికతను గూర్చి వివరించారు. సింగిల్ మేజర్ భౌతికశాస్త్రం చదవడం వల్ల, ఆ సబ్జెక్ట్‌లో పీజీ చేయడంతో అనేక ఉపాధి అవకాశాలున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం హనుమంతరావును సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీఎల్ శరణ్య, అధ్యాపకులు డాక్టర్ బి. హైమావతి, డాక్టర్ ఎస్ కిరణ్మయి, కె.సత్యనాగవేణి పాల్గొన్నారు.

నాగుపాముకు చికిత్స



ముంగిస దాడిలో గాయపడిన నాగుపాముకు చికిత్స చేస్తున్న అగనంపూడి వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ లావణ్య

అగనంపూడి: ముంగిసతో హోరా హోరీ పోరులో గాయపడిన నాగుపాముకు అగనంపూడి పశువైద్యశాల డాక్టర్ లావణ్య సపర్యలు చేశారు. వివరాలు.. జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని కిషోర్ ఇంటిమెట్ల ముందు భాగంలో నాగుపాము, ముంగిసలు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ పోరులో తీవ్రంగా గాయపడిన నాగుపామును స్నేక్ క్యాచర్ కిరణ్ పట్టుకొని అగనంపూడి పశువైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యురాలు లావణ్య వైద్యసేవలు అందించి నాగుపాము ప్రాణం కాపాడారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నాగుపాముకు మంగళవారం కూడా వైద్య సేవలు అందిస్తామన్నారు. పూర్తిగా కోలుకున్న తర్వాత కొండ ప్రాంతంలో విడిచిపెడతామని చెప్పారు.

నేడు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించున్నారు. జీతాలు వెంటనే చెల్లించాలని.. కార్మికుల తొలగింపు చర్యలను పూర్తిగా వెనక్కి తీసుకోవాలి, నిలిచిపోయిన టెండర్లు పిలవాలన్న డిమాండ్లపై అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. కార్మికులందరూ పాల్గొవాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు అనుసంధానంగా సిటీ బస్

దువ్వాడ నుంచి నేటి అందుబాటులోకి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు అదనపు సిటీ సర్వీస్ నడుపుతున్నట్టు ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) స్టీల్‌సిటీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే సమయానికి ఉదయం 5.25– 5.35 మధ్యలో సిటీ బస్సు నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు అందుబాటులో ఉంటుందని ఆయన చెప్పారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చే సమయానికి అదనపు సర్వీస్‌లు కావాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసిందని, ఈ మేరకు అదనపు సిటీ సర్వీస్ నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.

ఖోఖో ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి ఖోఖో అండర్ –14 బాలురు, బాలిక విభాగంలో పోటీలు, ఎంపికలు మంగళవారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. వాస్తవంగా ఈనెల 18న ఎంపికలు జరగాల్సి ఉండగా వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఉదయం 9గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని కోరారు.

తుపానుపై అప్రమత్తం

- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- ప్రతి రెవెన్యూ గ్రామంలో పునరావాసం గుర్తింపు

గాజువాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో గాజువాక మండల రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో భాగంగా గాజువాకలోని కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రచారం చేశారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకొనేందుకు వీలుగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇందులో 24/7 అందుబాటులో ఉండే విధంగా సిబ్బందికి విధులు అప్పగించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని వీఆర్వోలకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో మొత్తం 18 రెవెన్యూ గ్రామాలున్నాయి. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఒక పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా భవనాలను గుర్తించారు. వివిధ చోట్ల పాఠశాలలను పరిశీలించి వాటిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక కూడా పంపించామని గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లీ తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తుపాను సందర్భంగా ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే తమ పరిధిలోని వీఆర్వోలకు తెలియజేయాలని ఆమె కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇస్లాంపేట విద్యార్థులు



క్రీడా పోటీలకు ఎంపికైన విజేతలతో ఉపాధ్యాయులు

పెదగంట్యాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు బి. వనిత,పురుషోత్తం, వాసవీలు ఉమ్మడి విశాఖ జట్టులో ఆడేందుకు ఎంపికయ్యారు. అలాగే చెస్ అండర్ –17 బాలికల విభాగంలో చదరంగంలో పదో తరగతి విద్యార్థిని సీతాకుమారి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యిందీ.రాష్ట్ర , జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాల హెచ్ఎం జి.ప్రమీల, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహమూర్తి, సిబ్బంది అభినందించారు.

ఘనంగా సత్యసాయిబాబా అవతరణ దినోత్సవం



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసల పునఃస్థాపనకు భగవాన్ సత్యసాయి బాబా అవతరించారని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్, భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా అవతరణ ప్రకటన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గొంతినవానిపాలెంలోని సత్యసాయి మందిరం నుంచి మహా నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని బాబాకు పూజలు చేశారు. బాల వికాస్ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గళ్లా శంకర్‌సాయిరాం, రాధ, సీహెచ్ భాస్కరరావు, ఆదిరెడ్డి, బి.బాబూరావు, ఎం.కొండబాబు, బి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

దారి చూపే బోర్డుకు తుప్పు!



తుప్పపట్టి ఒరిగిపోయిన దువ్వాడ రైల్వేస్టేషన్‌కు దారిచూపే బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే తికమక పడాల్సి వస్తుంది. రాజీవ్‌నగర్ కూడలిలో ఫ్లైఓవర్ వద్ద ఎడమ, కుడి వైపు మార్గాలు వల్ల ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. వాస్తవానికి ప్రయాణికులకు అర్థమయ్యేలా రైల్వే అధికారులు రాజీవ్‌నగర్ వంతెన ఆరంభంలో దారి చూపేలా బోర్డులు ఏర్పాటు చేశారు. ఒకటి, నాలుగో నంబర్ల ప్లాట్‌ఫారాలకు వేర్వేరు దారులు ఉండడంతో ఈ బోర్డు అవసరం అయింది. మరో రోడ్డు రాజీవ్‌నగర్ లోపలికి వెళ్తుంది. అయితే అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు తుప్పు పట్టి పక్కకు ఒరిగిపోయింది. రైల్వే అధికారులు గుర్తించి కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.